క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో మేలుకొలుపు



మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రావికమతం: దొండపూడిలో బుధవారం మేలుకొలుపు కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మత్స్యవానిపాలెం గ్రామానికి చెందిన శ్రీరామా భజన బృందం సభ్యులు,మహిళలు, యువకులు తెల్లవారుజాము నుంచి భజనలు చేస్తూ గ్రామంలో ఇంటింటికీ తిరిగారు.

నేడు మేడిచర్లలో గడప గడపకు ..

కె.కోటపాడు : మండలంలోని మేడిచర్లలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శచీదేవి తెలిపారు. ఉదయం 8 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొనున్నట్టు ఆమె చెప్పారు.

11న నాతవరం మండల సమావేశం

నాతవరం: మండల సర్వ సభ్య సమావేశాన్ని ఈనెల 11న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే నాతవరం మండల సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు,అధికారులు, సర్పంచులు హాజరు కావాలన్నారు.

48 మందికి వైద్య పరీక్షలు



ఎం.కోడూరులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం. కోడూరులో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కేజీ పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు, 104 వైద్యాధికారి సురేష్ 48 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో స్థానిక ఎంపీహెచ్ఈవో పి.రవికుమార్, ఆరోగ్య సహాయకులు వెంకట్, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

మాడుగుల: స్థానిక అర్బన్‌కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం ఎంపీపీ వేమవరపు రామధర్మజ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి పెరుమాళ్ల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు కుక్కర మహేశ్వరి, వార్డు సభ్యురాలు అచ్యుతం, నాయకులు కె.మోదకొండ, శ్రీధర్, యడ్ల హేమంత్ పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా పశువైద్య సేవలు



ఆర్బీకేలో రికార్డు పరిశీలిస్తున్న ఏడీ బైరాగి

కె.కోటపాడు: పాడి రైతులు ఆర్బీకేల ద్వారా తమ పశువులకు వైద్య సేవలు పొందవచ్చని స్థానిక పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి తెలిపారు. ఎ.కోడూరులోని ఆర్బీకేను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాడి రైతులకు రాయితీపై అందిస్తున్న పశుదాణాతో పాటు గొర్రెలు, మేకలు, పెయ్యిలకు వేసిన డీవార్మింగ్ మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆడపెయ్యిల ఉత్పత్తి పథకంపై రైతులకు వివరించాలని పశువైద్య సహాయకుడు సాయికుమార్‌కు సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన పాటూరి అప్పలనాయుడు గేదె పడ్డకు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: రాష్ట్రంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ.. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. స్థానిక తులసీ కల్యాణ మండపంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ పరిధి కన్వీనర్లు,సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసం రూపొందించిన మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేశారని చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో హామీల అమలును సుసాధ్యం చేశారని తెలిపారు. ఏ ఒక్క అర్హునికీ అన్యాయం జరగ కూడదన్నదే సీఎం లక్ష్యాన్ని వలంటీర్లు నెరవేర్చారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సభ్యులు పథకాల మంజూరుకు లంచాలు గుంజేవారని విమర్శించారు. నేడు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.అనివార్య,సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని అర్హులు అధికారులను సంప్రదిస్తే, లోపాలను సరిచేసి మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏ ఇంటికి వెళ్లినా జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కొత్తగా నియమితులైన సచివాలయ పరిధి కన్వీనర్లు, త్వరలో నియమించనున్న గృహసారథులు సమష్టిగా పనిచేసి, అర్హులైన ప్రతీ నిరుపేదకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాల నాయుడు



మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న బూడి

ఆసరా పథకం చెక్కు అందజేత

మండలంలోని కోనాం శివారు గుంటి జగన్నాథపురానికి చెందిన మరిడిమాంబ ఎస్‌హెచ్‌జీ ద్వారా సంఘానికి అన్ని అర్హతలు ఉన్నా ఆసరా పథకం వర్తించలేదు. ఇటీవల ఆ గ్రామంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయం రావడంతో వెంటనే స్పందించారు. సెర్ప్ అధికారుల ద్వారా సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసికెళ్లి మూడేళ్ల నుంచి రావలసిన రూ. 2,75,634 లక్షలను మంజూరు చేయించారు. ఆ చెక్కును ఆ సంఘం సభ్యులకు డిప్యూటీ సీఎం అందించారు.ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజక వర్గ ఇన్‌చార్జి ఈరికూటి అప్పారావు,ఎంపీపీ కురచా జయమ్మ,జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదా జానకీరాం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు,వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలు,ఎంపీడీవోజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

దేవరాపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తానని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన 108 ఎంప్లాయీస్ యూనియన్ నేతలు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును తారువ క్యాంప్ కార్యాలయంలో బుధవారం కలిసి, తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కలిసిన వారిలో పాటేళ్ల దేముళ్లు, ఎం.నాగరాజు, బిఎస్. నాయుడు, జి. రామలక్ష్మి, వి.శ్రీరామమూర్తి తదితరులున్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట

- గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి, అన్ని వర్గాల ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. చోడవరం మండలం జుత్తాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల మంజూరు, సచివాలయం , వలంటీర్ల పనితీరు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని చెప్పారు. అర్హతే కొలమానంగా పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళాసాధికారత ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ధర్మశ్రీ చెప్పారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై ఇవ్వడంతోపాటు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పండిన పంటను కూడా అక్కడే అమ్ముకునే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకుని, చెరకు రైతులకు బకాయిలు పూర్తిగా చెల్లించినట్టు ధర్మశ్రీ చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రసాద్, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి త్రినాథ్ స్థానిక సమస్యలను ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి బొడ్డేడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

చోడవరం మేజర్ పంచాయతీ పరిధిలో పీఎస్‌పేటలో సచివాలయం-5కి నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. రూ.45లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలోకి సచివాలయాన్ని మార్చి, పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి తేనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు దండుపాటి సన్యాసిరావు, కోటేశ్వరరావు, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అంధులకు అక్షర ప్రదాత బ్రెయిలీ

చోడవరం రూరల్: అంధులకు చదువుకునే అవకాశాన్ని కల్పించి, వారిలో వెలుగు నింపిన మహానుభావుడు లూయిస్ బ్రెయిలీ అని మండల విద్యాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ముందుగా కేంద్రం వద్ద ఉన్న లూయిస్ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ విగ్రహాలకు ఎంఈవో శ్రీనివాసరావు, జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.రవికళ, ఎంపీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ బ్రెయిలీ, కెల్లర్‌లు అంధుల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపారన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు కె.దేముడు నాయుడు, పి.రమేష్, సీఆర్‌పీ కె.వి.ఎం.నాయుడు, అకౌంటెంట్ రవిశంకర్‌లు పాల్గొన్నారు.



బ్రెయిలీ, కెల్లర్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న దివ్యాంగులు

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

కె.కోటపాడు : అంధత్వం గల చిన్నారులపై వారి తల్లిదండ్రులు ప్రేమ, అధిక శ్రద్ధ చూపడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని స్థానిక భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయుడు బి.ఎ.వి.నాగేశ్వరరావు, సీహెచ్.కన్నమ్మ అన్నారు. జయంతి సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించాలని తెలిపారు.



లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాగేశ్వరరావు, కన్నమ్మ

అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు

రోలుగుంట: కొమరవోలు పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరైనట్టు సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఎంపీటీసీ రామన్ తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన బుధవారం ఇక్కడ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ముందుగా పంచాయతీ జమాఖర్చులను పంచాయతీ కార్యదర్శి చిరంజీవి చదివి వినిపించారు. తరువాత ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి, తాగునీరు అందిస్తున్నట్టు చెప్పారు. రహదారులు, చెరువుల అభివృద్ధికి రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపగా రూ.20 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. నిధులు మంజూరుకు సహకరించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి సర్పంచ్,ఎంపీటీసీతో పాటు మాజీ సర్పంచ గొర్లె చెల్లంనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీటీసీ గొర్లె రామన్

బోన్‌మేరో వ్యాధిగ్రస్తునికి విద్యార్థుల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టి.అర్జాపురం విద్యార్థులు



ఆర్థిక సాయం అందజేస్తున్న మేడివాడ హైస్కూల్ విద్యార్థులు

రావికమతం: బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కొత్తకోట హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న గిర్రెడ్డి నీరజ్ వైద్య ఖర్చుల కోసం టి.అర్జాపురం, మేడివాడ హైస్కూళ్ల విద్యార్థులు నగదు అందజేశా రు. ఇటీవల నర్సీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డిని నీరజ్ కలవగా ఆపరేషన్ చేయిస్తామని హామీఇచ్చారు. అయితే ఇప్పటి వరకూ అప్పులు చేసి వైద్యం చేయిస్తున్న ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోవడంతో పలువురు సాయం అందజేస్తున్నారు. కొత్తకోట గ్రామానికి చెందిన గుమ్ముడు ఫణికుమార్ రూ.50 వేలు అందించగా, టి.అర్జాపురం హైస్కూల్ విద్యార్థులు రూ.10,235, మేడివాడ హైస్కూల్ విద్యార్థులు రూ.5,095 హైస్కూళ్ల హెచ్‌ఎంల చేతుల మీదుగా బుధవారం అందజేశారు.

ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో వెంకటలక్ష్మి

గొలుగొండ: ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని జిల్లా బాలికల సంరక్షణ అధికారిణి(జీసీడీవో) వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక కస్తూర్బా బాలికల వసతిగృహాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ముందుగా పరిసరాలను, రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించి, చదువులో మంచి నైపుణ్యత పొందాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా బాలికల వసతిగృహం అధికారిణి జి.సుధ తదితరులు పాల్గొన్నారు.

శ్వాస సంబంధిత వ్యాధితోనే ఎద్దు మృతి



నాగయ్యపేటలో పశువుల ఆరోగ్యంపై రైతులను ఆరా తీస్తున్న పశువైద్యాధికారి మంజుషారాణి

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేటలో బీల వెంకటరావు ఎద్దు శ్వాస సంబంధిత వ్యాధితో మరణించినట్టు నిర్ధారించామని ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి తెలిపారు. నాగయ్యపేటలో మరణించిన ఎద్దు పరిసర ప్రాంతంలోని ఇతర పశువులకు బుధవారం ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని బీల వెంకటరావుకు చెందిన ఎద్దు లంపీ స్కిన్ వ్యాధితో మరణించ లేదని, చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వైద్య సేవలందించామని ఆమె తెలిపారు.

రెండు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

రోలుగుంట: మండలంలో బుచ్చింపేట సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ ఉలబాల సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు సత్యవతి బుధవారం పంపిణీ చేశారు. ఈ సచివాలయం పరిధిలో 24 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కొమరవోలులో సర్పంచ్ గొల్లు రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పింఛన్లు పంపిణీ చేశారు.



బుచ్చింపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చంద్ర,ఎంపీటీసీ సత్యవతి

భూసర్వేతో రైతులకు మేలు



మాట్లాడుతున్న మండల సర్వేయర్ రామచంద్రమూర్తి

కె.కోటపాడు : పారదర్శకంగా నిర్వహించే జగనన్న శాశ్వత భూహక్కు-భూసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని, అందరూ సహకరించాలని మండల సర్వేయర్ రామచంద్రమూర్తి తెలిపారు. కింతాడలో నిర్వహించనున్న భూసర్వేపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రమూర్తి మాట్లాడుతూ కింతాడలో 2682 ఎకరాలను సర్వే చేయనున్నట్టు చెప్పారు.ఈ సమావేశంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సూరి, ఈవోఆర్డీ ప్రసాద్, సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ఆర్ఐ జానకి, వీఆర్వో అనంత్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, బాల తదితరులు పాల్గొన్నారు.



రీ సర్వేకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

తోటకూరపాలెంలో సమగ్ర రీ సర్వే ప్రారంభం

రావికమతం: మండలంలోని తోటకూరపాలెంలో సమగ్ర భూ రీసర్వే బుధవారం ప్రారంభమైంది. ఎంపీపీ పైల రాజు, సర్పంచ్ రుత్తల ఎరుకుస్వామి నాయుడు, తహసీల్దార్ మహేశ్వరరావు భూమి పూజ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్,వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల బాపునాయుడు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం



రాజాంలో ధాన్యం కొనుగోలు కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

బుచ్చెయ్యపేట: దళారీలను నమ్మకుండా ఆర్బీకేల్లోనే ధాన్యం విక్రయించాలని రాజాం సర్పంచ్ మరిసా నాని తెలిపారు. రాజాం రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం టన్ను ధాన్యానికి రూ.2,060 మద్దతు ధర అందిస్తోందని చెప్పారు. నీలకంఠాపురం సర్పంచ్ పడాల నాగభూషణం,చోడవరం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి నాయుడుబాబు, ఎంపీఈవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

300 మంది మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న వెంకట అప్పారావు, ఉమాదేవి

బుచ్చెయ్యపేట: మండలంలో మంగళాపురం గ్రామంలోని 300 మంది పేద మహిళలకు మాజీ సర్పంచ్ అల్లంకి వెంకట అప్పారావు, ఎంపీటీసీ ఉమాదేవి బుధవారం చీరలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా మంగళాపురం, శివారు గ్రామం కుముదాంపేట గ్రామానికి చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

గ్రామీణ వికాస్ బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ

మాడుగుల రూరల్: డిపాజిట్లపై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు అత్యధిక వడ్డీ చెల్లిస్తోందని కేజే పురం గ్రామీణ వికాస్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఎస్. సాయిసుధాకర్ బుధవారం తెలిపారు. వికాస్ 777 స్కీమ్‌లో 777 రోజులకు గాను సీనియర్ సిటిజన్లకు 8.0 శాతం, సాధారణ పౌరులకు 7.50 శాతం వడ్డీ ఇస్తున్నట్టు తెలిపారు. కనీసం రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్టు చేయాలని చెప్పారు. వికాస్ 444 స్కీమ్‌లో 444 రోజులకు గాను సీనియర్ సిటిజన్లకు 7.6 శాతం, సాధారణ పౌరులకు 7.10 శాతం వడ్డీ అందిస్తామని చెప్పారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశాఖ డెయిరీ చైర్మన్ మృతి పట్ల సంతాపం

మాడుగుల రూరల్: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, పాలసొసైటీ అధ్యక్షులు, వేతన కార్యదర్శులు, సిబ్బంది సంతాపం తెలిపారు. కేజే పురం, ఎం. కోటపాడు, వంటర్లపాలెం, పాలసొసైటీల అధ్యక్షులు యల్లపు వెంకట శ్రీనివాసరావు, శానాపతి కొండలరావు, గోవిందరావుతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

‘22 ఎ’ లో స్థలం చేర్చడంపై ఆందోళన

రావికమతం: మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి పదేళ్ల క్రితం కేటాయించిన మూడున్నర సెంట్ల స్థలాన్ని 22 ఎ లో చేర్చడంపై నిరసన వ్యక్తం చేస్తూ దళిత సంఘాల నాయకులు బుధవారం ఆందోళన చేశారు. వారికి మద్దతుగా ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ అంబేడ్కర్ భవన్ ట్రస్ట్ చైర్మన్ బొడ్డు కల్యాణ్‌రావు మాట్లాడుతూ స్థలం రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొరపాటును తక్షణం సరిచేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి, సరిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చెవ్వేటి నూకరాజు,వాలిమరక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రావికమతంలో మానవహారంగా ఏర్పడిన దళిత సంఘాల నాయకులు,సభ్యులు

శిథిలావస్థలో వంతెన



ఏలేరు కాలువపై శిథిలావస్థలో ఉన్న వంతెన

నాతవరం: పెద గొలుగొండపేట, చిన గొలుగొండపేట మధ్య ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన మీద నుంచి నాతవరం మండలం నుంచి తూర్పుగోదావరి జిల్లాకు ఈ చుట్టు పక్కల గ్రామాల వారు రాకపోకలు సాగిస్తారు. వంతెన రక్షణ గోడలు సైతం పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరారు.

కమనీయం శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం కొబ్బరితోటలో బుధవారం శ్రీ పద్మావతి, అలివేలుమంగ సమేత శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణానికి హాజరైన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించి వేదపండితులు సీతారామాచార్యుల నుంచి ఆశీస్సులందుకున్నారు. ఆలయ నిర్వాహకులు రత్నాకర్‌ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు దంపతులు, 80వ వార్డు ఇన్‌చార్జి భాస్కరరావు, శివుడు, పీలా శ్యాంపాల్గొన్నారు.

అర్హులందరికీ సామాజిక పింఛన్లు

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివక్ష లేకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయని లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు తెలిపారు. పంచాయతీలో కొత్తగా మంజూరైన వారికి గురువారం సామాజిక పింఛన్లను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అవుగడ్డ సొంబాబు, వార్డుమెంబర్లు పెనగంటి అరుణ, కొరుపోలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దొరబాబు

నర్సీపట్నం రూరల్ సీఐగా రమణయ్య



బాధ్యతలు చేపట్టిన సీఐ రమణయ్య

నర్సీపట్నం: రూరల్ సీఐగా పి.రమణయ్య బాధ్యతలు స్వీకరించారు. రమణయ్యను నర్సీపట్నం రూరల్ సీఐగా నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీఐగా పని చేస్తూ వీఆర్‌కు బదిలీ అయిన శ్రీనివాసరావు నుంచి రమణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ తెలిపారు. రూరల్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ఎస్ఐలు లక్ష్మీనారాయణరావు, నారాయణరావు, కృష్ణారావు, రామారావు, సూర్యనారాయణ సీఐను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.